క్లుప్తంగా

కంఠారం రోడ్డుకు శంకుస్థాపన రేపు

కొయ్యూరు: మండలంలో చోద్యం వంతెన నుంచి కంఠారం పీహెచ్‌సీ వరకు తొమ్మిది కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డుకు పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి బుధవారం శంకుస్థాపన చేస్తారని ఎంపీడీవో లాలం సీతయ్య సోమవారం తెలిపారు. రూ.రెండు కోట్ల నాబార్డు నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. అదే రోజు కొమ్మికలో నూతన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభిస్తారని తెలిపారు.

31 మండల పరిషత్ సమావేశం

చింతూరు: ఎంపీపీ సవలం అధ్యక్షతన ఈనెల 31న చింతూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటరత్నం సోమవారం తెలిపారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు సంబంధిత శాఖకు చెందిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరం శివారులోని లోతట్టుప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో సోమవారం ఎస్‌ఐ ఎం.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని, మరోపక్క సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు వై.రామవరం వారపు సంత సందర్భంగా తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ సక్రమంగా లేని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో అడిషినల్ ఎస్‌ఐ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి సన్మానం



సర్వేయర్‌ను సన్మానిస్తున్న తహసీల్దారు తిరుమలరావు

కొయ్యూరు: సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వో పండయ్యలను తహసీల్దారు తిరుమలరావు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీరిద్దరూ ఉత్తమసేవలందిస్తున్నారని చెప్పారు. సకాలంలో సర్వే పూర్తి చేయడంతో సత్యనారాయణ ఉన్నతాధికారుల నుంచి ఇది వరకు ప్రశంసాపత్రం పొందారని తెలిపారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



విద్యార్థి సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో లాలం సీతయ్య అన్నారు. చీడిపాలెం ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. బోర్డుపై కొన్ని పదాలు రాసి విద్యార్థులతో చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. అంతకుముందు చీడిపాలెం సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం రాజేంద్రపాలెం పాత ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి, సూచనలు చేశారు.తరువాత ఉపాధిహామీ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల హాజరు పట్టిని తనిఖీ చేశారు.

నేడు గన్నేరుపుట్టులో గడప గడపకు ..

హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు తెలిపారు. అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

రైతుల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వంతాలలో విత్తనాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కల్యాణం



రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని గంపరాయి రైతు భరోసా కేంద్రంలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలు,ఎరువులు, ఇతర సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రాజ్‌మా సాగుపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జిల్లా నాయకులు సల్లంగి ఉమామహేశ్వరరావు, కొండలరావు,ఎంపీటీసీ వంతాల అప్పారావు, సర్పంచ్‌లు సురేష్‌కుమార్,లోహితాస్,బట్టి చిట్టిబాబు, శోభారాణి పాల్గొన్నారు.

హుకుంపేట: గిరిజనులకు 90 శాతం రాయితీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని మట్టుజోరు సర్పంచ్ సీదరి సొంబ తెలిపారు. మండలంలోని మట్టిజోరు సచివాలయంలో సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సుర్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దురియా పుష్పలత

చింతపల్లిరూరల్: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రాజమా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత,పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్ అన్నారు. చింతపల్లి 1,2,3 సచివాలయాల్లో దురియా పుష్పలత, పెదబరడ పంచాయతీలో సర్పంచ్ సమిడి గోపాల్ రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 90 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిసెంట్లు గంగా భవాని, చంద్రకళ, చేతన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో మొండిగడ్డ, రింతాడ, దేవరాపల్లి, లక్కవరపుపేట, పెదవలస ఆర్బీకే కేంద్రాల పరిధిలో రైతులకు ఎంపీపీ బోయిన కుమారి,



రింతాడలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న బొబ్బిలి లక్ష్మణ్

వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ బొబ్బిలి లక్ష్మణ్ సోమవారం రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేముడు,ఆనంద్,సర్పంచ్‌లు బుజ్జిబాబు,బొబ్బిలి లక్ష్మి,ప్రియంక, రామకృష్ణ,నాగేంద్ర పాల్గొన్నారు.

జి.మాడుగుల: సబ్సిడీపై అందజేస్తున్న రాజ్‌మా విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, మాజీ సర్పంచ్ కొండబాబు తెలిపారు. వంతాల పంచాయతీకి చెందిన గిరిజన రైతులకు సోమవారం రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పి.మహేష్, పి.రమణమూర్తి, జె.కాసులమ్మ, వైస్ సర్పంచ్ పి.తిరుపతమ్మ,వార్డు సభ్యులు చిన్నారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



జిల్లా కమిటీలో స్థానం పొందిన నాయకులకు సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ఇందుకూరుపేటలో సన్మానిస్తున్న నాయకులు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పెదబయలు మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులైన మాజీ జెడ్పీటీసీ జర్సింగి గంగాభవాని, ముంచంగిపుట్టు మండలానికి చెందిన వంతాల కొండలరావును అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం పెదబయలులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ,రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు, వైస్ ఎంపీపీ రాజుబాబు, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కట్టా సత్యనారాయణలను ఇందుకూరుపేటలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

అరకులోయ రూరల్: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ చేసిన ఆందోళనలో అమరులైన వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రామరావు తెలిపారు. అమర వీరులకు మండలంలోని గుగుడులో సోమవారం సీపీఎం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని పోరాటం చేసిన వామపక్షాల నాయకులు విష్ణువర్ధన్, రామకృష్ణ, బాలస్వామిలను అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా తుపాకులతో కాల్చిచంపిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలదేవ్,దశరథ్,గోపాల్, స్వామి సద్దు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. డివిజన్ వ్యాప్తంగా భూసమస్యలు, తాగు, సాగునీరు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇసుక రీచ్‌లో ఇసుక సరఫరాపై 16 అర్జీలు వచ్చాయి. స్పందన ఫిర్యాదులకు అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. పరిష్కరించేందుకు అవకాశం లేకపోతే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. స్పందనలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

మునగ చెట్లు పెంచేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం

నాతవరం: మునగ చెట్లు పెంచేందుకు ముందుకొచ్చే రైతులకు ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు చేస్తామని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునగ ఆకు వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, అవి తినడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ విషయాన్ని పంచాయతీలో గ్రామసభలు ద్వారా రైతులకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకంలో మండల వ్యాప్తంగా చేపట్టే పనులపై చర్చించా రు. గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సమస్య, స్పందన ఫిర్యాదులపై చర్చించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ఎం.ప్రసాద్, జేఈలు రాజేష్, వెంకటేశ్వరమ్మ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

రాయితీపై వ్యవసాయ యంత్రాలు

మాడుగుల: వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. అవురువాడలో రైతులకు ఆయన అవగాహన కల్పించారు. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రం ద్వారా ఒక ట్రాక్టరు, రోటోవేటర్, మూడు పవర్ టిల్లర్లు గ్రూపు సభ్యులకు రాయితీపై అందజేస్తామన్నారు. గ్రామంలో షిర్డీసాయిబాబా వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రానికి ఒక యూనిట్ అందజేశామన్నారు. వీటిని ఇతర రైతులు అద్దెకు తీసుకోవచ్చన్నారు. మండలంలో 22 వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.1.60 కోట్ల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేశామన్నారు. ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముంచంగిపుట్టు/అరకులోయ రూరల్/ పెదబయలు: పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు,అరకులోయ, పెదబయలు మండల పరిషత్ కార్యాలయాల వద్ద సోమవారం ఆందోళన చేశారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆయా కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో పలువురు సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పలు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన రేపు

రంపచోడవరం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు), ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శంకుస్థాపనలు చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర తెలిపారు. ఊట్ల, జగమట్లపాలెం, గొట్లగూడెం, ధరమడుగుల, దిబ్బలవీధి, దబ్బవలస, వెట్టి చిలకల, పీరుకొండ గ్రామాల్లో జరిగే శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

ఇందుకూరుపేటలో పొలంబడి



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

దేవీపట్నం: ఇందుకూరుపేట రైతుభరోసా కేంద్రం పరిధిలో రైతులకు సోమవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కాండం తొలుచు పురుగు నివారణ పద్ధతులపై వ్యవసాయ ఉద్యాన సహాయకులు కాలచర్ల రవి రైతులకు అవగాహన కల్పించారు. వరి పొలంలో ఆకుల కత్తిరింపు, పిలకల తొలగింపు వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్ఏలు అరవింద్, రేవంత్, భవాని, షర్మిల పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



టగ్ ఆఫ్ వార్ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రెండు రోజులపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ పోటీలు నిర్వహించాలని విద్యా శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో తూటిపాల యూపీ స్కూల్లో సోమవారం టగ్ ఆఫ్ వార్ పోటీల్లో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

వరిసాగులో జాగ్రత్తలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సేద్య సిబ్బంది

మాకవరపాలెం: వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రకృతి సేద్య సిబ్బంది రైతులు అవగాహన కల్పించారు. సోమవారం నారాయణరాజుపేటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పొలాలను సందర్శించిన సిబ్బంది కాలిబాటలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. డీఏపీ బదులుగా ప్రకృతి విధానంలో ద్రవ జీవామృతం తయారు చేయడం, పొలాల్లో పిచికారీ చేసే విధానాలను తెలియజేశారు. ద్రవ జీవామృతం వాడటం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటలు ఆరోగ్యకంగా ఉంటాయన్నారు. ప్రకృతి సేద్య సిబ్బంది సుదర్శన్, గణపతిలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు

మారేడుమిల్లి : గిరిజన, గిరిజనేతర నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉన్నతి కార్యక్రమం ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు రంపచోడవరం వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2019 సంవత్సరం నుంచి ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబంలో ఉన్న టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రంపచోడవరం వైటీసీలో కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్, సాఫ్ట్ స్కిల్, సేల్స్ సూపర్‌వైజర్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత వసతితో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హత, రేషన్, ఆధార్, ఉపాధి హామీ కార్డులు,కుల, ఆదాయ సర్టిఫికెట్లు, బ్యాంక్ అకౌంట్ బుక్, నాలుగు పాస్ ఫొటోలతో వైటీసీలో సంప్రదించాలని తెలిపారు. 7981349691, 8332090278 అనే నంబర్లకు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వై.రామవరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్షమించేది లేదని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అడ్డతీగల సీఐ వై.రాంబాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలతో అడవి జంతువులను వేటాడుతున్నారని, విద్యుత్ తీగల కారణంగా షాక్‌కు గురై ఎంతో మంది మరణిస్తున్నారని తెలిపారు. అడవి జంతువుల వేటకు విద్యుత్ తీగలు అమరిస్తే చర్యలు తప్పవన్నారు. అటువంటి వారి గురించి సమాచారం ఇవ్వాలని కోరారు. డబ్బుకు ఆశపడి గిరిజన యువకులు గంజాయి రవాణాకు సహకరిస్తున్నారని తెలిపారు. అసలు నేరస్తులు తప్పించుకుని అమాయక గిరిజనులు జైలు పాలవుతున్నారన్నారు. గంజాయి వ్యాపారులు గ్రామాల్లోకి వస్తే సమాచారం అందించాలని సీఐ కోరారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, స్టేషన్‌లో భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి వచ్చే ఎంఎల్‌సీ కేసుల వివరాలపై స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్‌తో సీఐ చర్చించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ ఎం.సంతోష్‌కు మార్, అడిషినల్ ఎస్‌ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.



వై.రామవరం పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

ఘనంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ట

రంపచోడవరం: మండలంలోని దిరిసినపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సమరత సేవా ఫౌండేషన్ పర్యవేక్షణలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, దేవాలయ ప్రముఖ్ కర్రి సన్యాసి రెడ్డి,డివిజన్ సంస్కృతి ప్రముఖ్ పల్లాల ఈశ్వర్ రెడ్డి, అర్చకులు ఎ.కృష్ణారెడ్డి, ధర్మ ప్రచార సేవా భక్త బృందం సమన్వయ కర్త నల్లమిల్లి వేంకట రామారెడ్డి దంపతులు పాల్గొన్నారు.



దిరిసినపల్లిలో విగ్రహ ప్రతిష్ట చేస్తున్న భక్తులు

నేడు రంపచోడవరంలో సత్యదేవుని వ్రతాలు

రంపచోడవరం: అన్నవరం సత్యనారాయణస్వామి వారి వ్రతాలు మంగళవారం నుంచి ఏజెన్సీలో ప్రారంభంకానున్నాయి. దీనిలో భాగంగా సత్యరథంతో గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. రంపచోడవరంలో సత్యరథం వద్ద ఏఎస్పీ జగదీష్ హడహళ్లి, స్థానికులు స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక నారాయణగిరిపై గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రాంగణంలో మంగళవారం సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న ఏఎస్పీ జగదీష్ హడహళ్లి

చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

అరకులోయ రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉన్నత విద్యా కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపై శ్రద్ధ చూపించాలని, క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. ఈకార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు చలపతిరావు,పుష్పరాజు, అధ్యాపకులు సుందరి,గణేష్,విజయలక్ష్మి,నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్

రోడ్డుకు నిధులు మంజూరు చేయాలంటూ వినతి

మాడుగుల: మండలంలో 11 పంచాయతీలకు ఆధారమైన కింతలి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ స్పందనలో ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్ వినతిపత్రం సమర్పించారు. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు గురవడంతో 40 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనికి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్పందించి వెంటనే ఎస్టిమేషన్ తయారు చేసి నిధులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీటీసీలు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు శానాపతి గంగాధర్, గొల్లవిల్లి రాజేష్, రాము, బొమ్మిశెట్టి శ్రీనువాసరావు పాల్గొన్నారు.



కలెక్టరుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్

నేత్ర శస్త్రచికిత్సలకు 35 మంది ఎంపిక

దేవరాపల్లి: స్థానిక ఆరోగ్య ఉప కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. 59 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 35 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు. ఈ శిబిరంలో డాక్టరు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ప్రతినిధి కె.భవానీ, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ అలేఖ్య, క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్. అశ్వినీకుమార్, నర్సింగ్, పుష్పలత, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంటి శస్త్రచికిత్సలకు బయలుదేరుతున్న వృద్ధులు